# పెదవు మోదు లేదా పగ

ఇచ్ఛాపురపు
రామచంద్రం

ఆ బల్లకి నాలుగువైపులా ఉన్న నాలుగు కుర్చీలలో కూర్చున్నవారు సినీనిర్మాత నిరంజన్, దర్శకుడు దర్పణ్, సంగీత దర్శకుడు రాగేశ్వరరావ్, సినీరచయిత శ్రీనివాస్ ఉరఫ్ శ్రీ.

బల్లమీదున్నది మందు సీసా. ఫారిన్ విస్కీ బాటిల్. అందుకే ఆ ఠీవీ, గర్వమూ. దాని పక్కన విధేయంగా ఒదిగి ఉన్నవి సోడాబుడ్లు, మంచుముక్కలు గల ఫ్లాస్కు.

మంచింగ్‌కి ముక్కలను కడుపులో దాచుకొని, ఏమీ ఎరగని నంగనాచిలా కనబడుతున్న హాట్ ప్యాక్.


సినిమాలో ఎక్స్ట్రాల్లా – మరింత ఒదిగొదిగి ఉన్నవి – గ్లాసులు, ప్లేట్లు, చెంచాలూ, సిగరెట్ పెట్టెలూ, నిప్పుపెట్టె.


కుర్రాడువొచ్చి బుద్ధిగా గ్లాసులు సిద్ధం చేశాడు. గ్లాసులు సిద్ధం చేయడమంటే అప్పటికే అవి అతి శుభ్రంగా ఉండి తళతళలాడుతున్నా, మరోసారి కడిగి తుడిచినట్లు నటించడం, గ్లాసుల్లో మందూ, సోడా, మంచుముక్కలూ వేసి... ప్లేట్లలో మంచింగ్ ముక్కలుంచి... సిగరెట్లూ అగ్గిపెట్టే అందుబాటులో ఉంచడమన్నమాట.

మూత తీసేసరికి బుస్సుమంటూ పొంగుతూ తన్ను కొచ్చింది సోడా. అంతకంటే పొంగిపోతున్నారు వీళ్ళు నలుగురూ. ఔను... నాలుగు నెలల గ్యాప్ తరువాత కూర్చుంటున్నారు మరి. కిందటి సినిమా తీసి నాలుగు నెలలు అయిపోయింది. అది బాగానే ఆడింది. అయినా తదుపరి చిత్రం తీయలేకపోవడానికి కారణం... వాళ్లు నలుగురూ నలభై ఐదుకి పైబడినవారే.

మందు, విందు, పొందు లాంటి కొన్ని విషయాలలో ఎంత కుర్రవాళ్లు, ఆధునికులూ, ఫాస్టో... మరికొన్ని సందర్భాలలో అంత ముసలివాళ్లూ, పాతచింతకాయ పచ్చడీ, నత్తలూ. సినిమా తియ్యడానికి 'కథ' ఉండాలంటాడు ఆ దర్శకుడు! స్క్రిప్ట్ సిద్ధంకానిదే షూటింగ్ మొదలు పెట్టనంటాడు. ఇది వొట్టి పాత సినిమా యుగం మనస్తత్వం కాదూ? ఈ రోజుల్లో సినిమా తీసే యడం పూర్తయ్యాకే కథ ఉండడంలేదు కదా. సినిమా తియ్యక ముందు స్టోరీ ఏమిటి? అది హిస్టరీయే కదా! తెలుగు సినిమా చరిత్రలో ఇప్పుడు తెలుగు సినిమా? అంటే బాలక్రిష్ణో, చిరంజీవో, నాగార్జునో అంతే కదా? సినిమా మొదలెట్టాలే కానీ క్లాప్‌బోయ్

అయినా చెప్పేస్తాడు కథ. ఈ సత్యాన్ని ఆ చతుష్టయం అంగీకరించరుగాక అంగీకరించరు. ఆరు పాటలూ, ఐదు ఫైట్లూ, హీరోయిన్‌ది ఓ స్నానమూ, హీరో హీరోయిన్లు కిందామీదా పడడాలు మూడు – వెరశి తెలుగు సినిమా ఉరఫ్ యూత్ పిక్చర్... అనే ఆధునిక సినీసూత్రాన్ని జీవితంలోకి తెచ్చుకోకపోబట్టే ఆ రచయిత నాలుగు నెలలు తీసుకొని గానీ కథ రాయలేకపోయాడు. రచయిత కథ రాయలేకపోయాడు కనుక మిగిలిన శాఖల వాళ్లకి పనిలేకపోయింది. ఎట్టకేలకు రచయిత కథ రాసి తెచ్చాడు కనుకనే ఈ సిట్టింగు, ఉత్సాహం, మందూ, ఎట్సెట్రాలు. పెద్దవిషయాలు మందు మీదే కదా తేల్చుకునేది.





"సబ్జెక్టేమిటి?" రెండో రౌండు ముగిశాక అడిగాడు దర్శకుడు.

"ప... గ..." నోట్లో చికెన్ పీస్ ఉండడం వల్ల మధ్య గ్యాప్ వొచ్చింది పదంలో.

"ప... గ... ఐదూ మూడూ" మేధావిలా నవ్వాడు సంగీత దర్శకుడు.

"ఐదూ మూడూ! అదేమిటీ?" అడక్కుండా ఉండలేకపోయాడు నిర్మాత.

"సరిగమపదని... లో ఐదు ప మూడోది గ. ఐదూ మూడూ అంటే ప.గ." నవ్వాడు. సం.ద. తన తెలివితేటలకి తానే మురిసిపోతూ.

"సరి...!" విసుక్కున్నాడు నిర్మాత సిగరెట్ అందుకుంటూ. "ఒకటీ రెండూ..." మళ్లీ నవ్వాడు సం.ద. "అంటే... స... రి..."

"చాలు" కసురుకున్నాడు నిర్మాత.

మూడో రౌండుకి శుభారంభం చేస్తూ "ఇక మనం కథలోకి వెళ్దామా?" అడిగాడు దర్శకుడు.

"తప్పకుండా. రెడీ... స్టెడీ... స్టార్ట్" అంటూ రచయిత వైపు చూసాడు నిర్మాత. మందు గుక్క తాగి... సిగరెట్ అంటించి... జేబులోనుంచి ఒక కాగితం తీసి లాంచనప్రాయంగా ఒకసారి దానివైపు చూసి... సరస్వతీ నమస్తుభ్యం చదివి (ఇది రచయిత గారి సెంటిమెంటు, ఏదైనా రాసే ముందు కాని, తను రాసింది చదివే ముందుకానీ విధిగా సరస్వతీ నమస్తుభ్యం చదువుతాడు) గంభీరంగా అన్నాడు. "ఇది ప్రధానంగా

పగ కథ."

నిర్మాత కుర్రాడిని పిలిచి "ఇది సీక్రెట్‌గా ఉంచవలసిన మ్యాటరు. కిటికీ తలుపులు మూసెయ్. బయటినుంచి 'ఎవరూ వినకుండా జాగ్రత్తగా చూడు" అని అదేశాలిచ్చాడు. రచయిత చెప్పే కథ పైవాళ్ల చెవిన పడిందో, వాళ్లు తమ కంటే ముందు బొమ్మతీసేస్తారని... యీ రంగుల లోకమంతా మాయామేయ జగమనీ అతని భయం. అందులో కొంత నిజమూ, అనుభవమూ లేకపోలేదు. అలాగే బోయ్‌కి జాగ్రత్త చెప్పి – నిర్మాత తన కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు. దర్శకుడు కూడా బుద్ధిమంతుడిలా దృష్టినంతటినీ రచయిత ముఖంమీదే పెట్టి ఉంచాడు.

కథ జరుగుతూంది... సీసాలో మందు తరుగుతోంది. గ్లాసుల శబ్దాలూ... అగ్గిపుల్లలు గీసిన శబ్దాలూ మినహా అక్కడ నిశబ్దంగా ఉండి. రచయిత అలాంటి వాతావరణంలో కథ చెబుతున్నాడు.

సిగరెట్లు తగలబడుతున్నాయి వారినోళ్లలో. కథ కంచికో కాటికో వెళ్లడానికి దగ్గరపడుతూంది. సీసాలో మరో రౌండుకి మాత్రం సరిపడే విస్కీ, అలాగే పరిమితంగా సిగరెట్లు ఉండగా 'కథ అయిపోయింది' అని చెప్పేసాడు రైటర్.

"కథ – ఎక్సలెంట్..."

"వండర్‌ఫుల్..."

"మార్వలస్..."

రచయితలో చాలా ఆనందమూ, కొంచెం గర్వమూ. మీసం మెలివెయ్యడానికి అతను నున్నగా గీసుకున్నాడు. సరిగ్గా ఆ క్షణంలో... రచయిత తన కథని తిరుగులేదనుకుంటున్న తరుణంలో... అతని బుగ్గమీద... దోమ!

"కరవడానికి కాదులే. కలవరపడకు".

"మరి? దోమంటే కరవడమూ, సంగీతం పాడడమే కదా?" అడిగాడు రచయిత.


"ఇప్పుడు మాత్రం కరవడానికి కాక నీ కళ్లు తెరిపించడానికే నీ బుగ్గమీద వాలాను."

"నా కళ్లు మూసుకుపోయాయనా? తెరిపించడం? మందు మరీ అంత తాగలేదులే."

"మందు మూత కాదు. గర్వంతో కళ్లు మూత. పగ మీద గొప్పకథ రాసేసానని నువ్వు తెగ గర్వపడిపోతున్నావు! నువ్వు రాసిన కథ కంటే వెయ్యి రెట్లు గొప్ప కథలో పాత్రను నేను" సంగీతం పాడినట్లు చెప్పింది దోమ. "సబ్జక్ట్ పగే."

"సరే. చెప్పు. బాగుంటే వాడుకుంటాను."

"మత్కుణం... అంటే నల్లి. నీకు తెలిసి ఉండకపోవచ్చు. సుమారు ఏభై అరవయ్యేళ్ల క్రితం నల్లులదే రాజ్యమంటే నమ్ము. సినిమా హాలులో కుర్చీలు, బస్‌లలో సీట్లు, మంచాలు... సోఫాలు... పరుపులు... నల్లిలేని చోటే ఉండేది కాదు. నల్లి కుట్టని నరుడే ఉండేవాడుకాదు... అంటే నమ్ము నరమానవా. పరిస్థితి ఎంత విషమించిందంటే– "నల్లుల బాధ నారాయణుడికి కూడా వద్దు. పగలు పనితోచనివ్వవు, రాత్రి నిద్రపోనివ్వవు వీటిని సమూలంగా అంతం చెయ్యకపోతే మన నరజాతి అంతు చూసేటట్లున్నాయి. వేడినీళ్లు పోయడం, మంచాలు వగైరాలను ఎండలో వెయ్యడం... కిరసనాయిలు పొయ్యడం... ఎన్ని చేసినా వీటిని కడతేర్చలేకపోతున్నాం" అంటూ జనం మీటింగులు వేసి మరీ చర్చించేవారు. "నల్లుల బాధ లేకుండా చేసే చిట్కా" అని వార్తాపత్రికలలో ప్రకటనలు వచ్చేవి. ఒకరు ఆ చిట్కా పంపమని పది రూపాయలు – ఆ రోజుల్లో పదిరూపాయలంటే పైపైన లేవు – పంపగా... ఆ కంపెనీ నుంచి




వచ్చిన పాకెట్‌లో ఒక సీసా ఉంది. దానిలో నల్లటి ద్రవం. 'ఈ ద్రవాన్ని ఒక్క చుక్క నల్లి నోట్లో వెయ్యండి పెదవులు లాగి. ఈ విషం దాని పొట్టలోకి వెళ్లడమే తడవుగా అది చస్తుంది. చచ్చితీరుతుంది. ఒకవేళ ఏ కారణంగా అయినా నల్లిచావకపోతే దీనితో మేము పంపుతున్న రెండురాళ్లలోనూ చిన్నదానిమీద నల్లిని ఉంచి, పెద్దరాయితో కొట్టండి. మూడో దెబ్బకు కూడా నల్లి చావకపోతే నేలమీద పడుకోబెట్టి కాలిబొటన వేలితో గట్టిగా నలిపి చంపెయ్యండి' అని చిట్కా రాసిన కాగితం కూడా పంపారు. దీనినిబట్టి ఆ కాలంలో నరుడికి ఎంత ప్రాణసంకటమయిందో అర్థంచేసుకోగలరు..." ఆగింది దోమ.

రచయిత అర్థం చేసుకోగలనన్నట్లు తల ఊపాడు.

దోమ మళ్లీ చెప్పసాగింది. "మనిషి

నల్లిని శత్రువుగా పరిగణించి యుద్ధ ప్రాతిపదికమీద నల్లీ సంహారిణి అదే... మత్కుణ మారణాయుధం అనదగిన డి.డి.టి. పౌడర్‌ని కనిపెట్టి ప్రయోగించాడు. దీనితో నల్లిజాతే అంతరించిపోతుందని తెలిసింది. అంతే... కొన్ని మత్కుణాలు దేవుడి గురించి తీవ్రమైన తపస్సు చేసాయి. సామూహిక మానభంగం, సామూహిక భోజనం, సామూహిక భజన అంటారే... అలాగ... సామూహిక తపస్సు చేసాయి వేలకొద్దీ నల్లులు.

ఇలాంటి సామూహిక తీవ్రతపస్సు - దేవుడికి కూడా కొత్తే. అంచేత కొంచెం కంగారుపడి - తొందరగానే ప్రత్యక్షమైపోయి "నల్లుల్లారా! ఏమి మీ కోరిక?" అని అడిగాడు.

మనుషుల మీద పగబట్టిన నల్లులు 'మా జాతి అంతరించిపోతోంది. మాకు మనుషుల మీద పట్టరాని కసిగా, పగగా ఉంది. కొత్తజాతి నొకదానిని సృష్టించండి మా అంశతో. మేము ఎగరలేకపోబట్టీ నరులు మమ్మల్ని హింసలు పెట్టి చంపగలిగారు. అంచేత - మీరు రూపొందించబోయే కొత్తజాతికి రెక్కలుండాలి. ఎగర

గలగాలి. మనిషిని నల్లి కుడితే బాధేతప్ప వ్యాధి కలగలేదు. కాని కొత్తజీవులు కుట్టాయో మనిషికి వ్యాధులు కూడా రావాలి వాటి ద్వారా. సర్వాంతర్యాములై ఎక్కడపడితే అక్కడ ఉండగలగాలి. కాటుతోనే కాక సంగీతంతో కూడా మనిషిని హింసపెట్టగలగాలి. అప్పటికి గానీ మా మత్కుణ జాతి పగ తీరదు' అని ముక్తకంఠంతో విన్నవించాయి.

"ఎంత పగ! ఎంత పట్టుదల! ముచ్చటేస్తూంది చూస్తూంటే... మీ మాటలు వింటుంటే కాని... పగ అడగించుటెంతయు శుభంబు..."

"వొద్దు భగవంతుడా! నీతులు వద్దు. ఎంత గుండె మండితే మేమిలాటి కోరిక కోరతామో ఒక్కసారి ఆలోచించు. మేం కోరిన వరం ప్రసాదించు. తపస్సు తక్కువైతే ఆ మాట చెప్పు"

"లేదు... లేదు... సామూహిక తపస్సు కదా... ఎక్కువే అయింది. సరే మీ కోరిక తీరుస్తాను. కానీ... మరో జీవరాశిని... జాతిని సృష్టించి మాత్రం కాదు. ఇప్పటికి అనామకంగా ఉన్నాయి దోమలు. అనకాపల్లి, విజయనగరం లాంటి కొన్ని ఊళ్లలో తప్ప దోమలకు పెద్దగా గుర్తింపు లేదు. కాని... యికపై దోమలు అన్ని చోట్లా వీరవిహారం చేసేయడం మొదలు పెడతాయి. దోమలు మనిషికి చాలా పెద్ద సమస్య అవుతాయి. మీరు తీర్చుకుందామనుకుంటున్న పగ, ప్రతీకారం అవి తీర్చుకుంటాయి. సంతోషమేనా? సంతృప్తేనా?" అడిగాడు దేవుడు.

"ఓ! అది మరీ మంచిది. మా చేతులకు మట్టి అంటుకోకుండా... అదేలే... మాకు పాపం రాదు... మా పగా తీరుతుంది." అని ఆ నల్లి తపస్వులు అంగీకరించగానే దేవుడు తథాస్తు అంటున్నట్లు చేతులు ఆడించి ఆకాశంలోకి ఎగిరి మాయమైపోయాడు.

ఓసారాగి, "నరుడా! దోమలు యీ రోజుల్లో మనుషులని ఎన్నివిధాల పీడించి వదులుతున్నాయో నీకు తెలుసుకదా!" అడిగింది దోమ.

"తెలియకేం? రాసుకోనివ్వవు, చదువుకోనివ్వవు, మాట్లాడుకోనివ్వవు, ఝుమ్మంటూ సంగీతం పాడుతూ మనిషి చుట్టూ ముసురుకుంటాయి. కొన్ని దోమలవల్ల జ్వరాలు వస్తున్నాయి. నెలసరి సరుకులతో దోమలను దూరంగా ఉంచే సాధనాలు... దోమల చక్రం లాంటివి తెచ్చుకు తీరవలసిందే రాత్రి నిద్రపోవాలంటే. ఆర్థికంగా యిలా వేధిస్తున్నాయి. ఏంచేసినా అజేయంగా ఉండిపోతున్నాయి తప్ప మనిషికి లొంగడం లేదు."

"రామకృష్ణ పరమహంస శిష్యులు బలరాం బోస్ అనుకుంటాను వారి పేరు... వీరు కూడా దోమల వలన భంగపడినవారే. దోమల బాధ వలన తపస్సు సాగించలేనివారే", అంటే దోమలకి తిరుగులేదనే కదా?"

"నిస్సందేహంగా..." ఒప్పేసుకున్నాడు రచయిత.

"చూసావా? పగ... ప్రతీకారం కథ అంటే ఏ రేంజిలో ఉండాలో. ఇకమీదట మెదడుకి మరింత పదునుపెట్టు... ఓ.కె.? నామాటలు విన్నావు కదా అని కుట్టకుండా పోతున్నాను" అని దోమ అతని బుగ్గ మీంచి ఎగిరిపోయింది.

"కథ బాగానే ఉంది కానీ తెలుగు తెరకి పనికిరాదు" గొణుక్కున్నాడు రచయిత.

"ఏమిటి కవిగారూ మీలో మీరే మాట్లాడుకుంటున్నారు?" అడిగాడు నిర్మాత.

"ఏమీ లేదు. కథబాగానే ఉందికదా... ఆ గ్లాసు నింపవయ్యా కుర్రాడా! సీసాలో మరో రౌండుకి వచ్చేంత ఉంది కదా?" అంటూ సిగరెట్ అంటించాడు సినీరచయిత. ●